క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గస్థాయి సమావేశం

• పాల్గొనున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ

చోడవరం : వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజక వర్గం సమన్వయకర్తగా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈనెల 24వ తేదీన కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాన్ని చోడవరంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేశారు. ధర్మశ్రీ, అమర్‌నాథ్ ఇద్దరూ కలిసి కార్యకర్తలతో సమావేశమై పార్టీ అభివృద్ధిపై రానున్న కాలంలో చేపట్టవలసిన చర్యలపై చర్చిస్తారు. కొత్తగా సమన్వయకర్తగా నియమితులైన అమర్‌నాథ్ ఈ సందర్భంగా నియోజకర్గంలో కార్యకర్తలందరితో పరిచయం చేసుకుంటారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రతినిధులు కోరారు.

దేవరాపల్లి మండల సర్వసభ్య సమావేశం రేపు

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ బుల్లిలక్ష్మితో పాటు జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు శాఖాపరమైన తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

నేడు చీడికాడ మండల సర్వసభ్య సమావేశం

చీడికాడ : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్యామ్‌సుందరరావు తెలిపారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

మామిడిపల్లిలో జిల్లా స్థాయి కబడ్డీ, ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి : మామిడిపల్లిలో మరిడిమాంబ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ళ, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు గ్రా మ పెద్దలు, యూత్ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఎడ్ల పోటీల విజేతలకు వరుసగా రూ.10 వేలు, 8 వేలు, 6 వేలు, 4 వేలు, 2 వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతలను అందజేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.


చివరి దశలో రబీ వరి నాట్లు



మాడుగులలో వరి నాట్లు వేస్తున్న దృశ్యం

మాడుగుల : మండలంలో ఈ ఏడాది రబీ వరి నాట్లు దాదాపు పూర్తి కానున్నాయి. మండలంలో రబీ సాధారణ విస్తీర్ణం 4,200 ఎకరాలు కాగా ప్రస్తుతం 3,500 ఎకరాల్లో వరినాట్లు వేసారు. ఈ ఏడాది కురిసిన తుపానులకు, భారీ వర్షాలకు జలాశయాలతో పాటు పంట చెరువుల్లో సాగు నీరు పుష్కలంగా ఉండడంతో రబీ వరి పంట మంచి దిగుబడి ఇస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవంతిలో సాంకేతిక సదస్సు



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

మాకవరపాలెం : తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 31, ఫిబ్రవరి 1న జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్టు అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పాఠశాలలో గురువారం సాంకేతిక సదస్సుకు సంబంధించిన గోడ పత్రికలను ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినర్జి 2025 పేరుతో జరిగే ఈ సదస్సులో సాంకేతిక విద్యకున్న ప్రాధాన్యం, నూతన పోకడలపై అనుభవజ్ఞులతో అవగాహన కల్పిస్తామన్నారు. వివిధ నమూనాల ప్రదర్శన ఉంటుందన్నారు.





గొలుగొండ సమీపంలో సాగు చేస్తున్న టమాటా

టమాటాతో వేసవిలో సిరుల పంట



ఏఎల్‌పురం మార్కెట్‌లో అమ్మకాలకు వచ్చిన టమాటా (ఫైల్)

గొలుగొండ : వేసవిలో టమాటా సాగుకు పెట్టింది పేరు గొలుగొండ మండలం. ఇక్కడ సాగు చేసిన టమాటా పంట వేసవిలో ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి కావడం జరుగుతుంది. ఒక్కడ సారవంతమైన నేలలతో పాటు నీటి సదుపాయం ఉండడం వల్ల రైతులు ఈ సీజన్ అంతా టమాటాపై ఆధారపడి ఉంటారు. ఇప్పటికే నవంబర్ నెలాఖరులో వేసిన పంట కాపు దశలో ఉంది. డిసెంబర్ చివరి వారంలో ఉన్న పంట మొక్క దశలో ఉంది. ఈ నెలాఖరులోగా మరో 200 ఎకరాల్లో నాట్లు వేయడం కోసం రైతులు అన్ని పనులు చేస్తున్నారు.

ప్రతీ ఏటా వేసవి సాగు

డివిజన్‌లో టమాటా సాగు అధికంగా గొలుగొండ మండలంలో జరుగుతుంది. నవంబర్, డిసెంబర్, జనవరి నెలలో ఈ సాగు అంచెలంచెలుగా సాగు చేయడం జరుగుతుంది. మే నెల వరకు ఈ ప్రాంతంలో టమాటా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ఈ సీజన్ వేసిన పంటకు డిమాండ్ ఉంటుంది. సుమారుగా ప్రతి ఏటా 400 ఎకరాలకు పైగా ఒకే ప్రాంతంలో సాగు చేయడం విశేషం.

సారవంతమైన నేలలు

వేసవి టమాటాకు కావాల్సిన నేలలు ఈ ప్రాంతంలో ఉండటంతో ఈ సాగుకు అనుకూలంగా ఉంది. నల్లరేగడి, ఉసుక పాటిమట్టి నేలు అధికంగా ఉన్నాయి. దీని వలన వేసవిలో నీటి సదుపాయం ఉండటం వలన సాగుకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ నేలల్లో పంట వేయడం వలన దిగుబడులు అధికంగా రావడం జరుగుతుంది. వ్యవసాయ మోటార్లు, దారగెడ్డ ప్రాంతంలో ఇంజిన్లు సాకారంతో సాగు చేస్తారు. పై రెండు నేలలు ప్రభావం వేసవిలో నీటి వల్ల భూమి తేమ తగ్గిపోకుండా ఉంటుంది.

> **ఒకేచోట 400 ఎకరాల్లో సాగు..**
>
> మండలంలో జోగుంపేట, సాలికమల్లవరం, గొలుగొండ, జాలర్లపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, వెంకటాపురం ప్రాంతాల్లో ఈ సాగు విస్తారంగా సాగుతుంది. ఈ గ్రామాలు అన్ని తాండవ జలాశయంకు ఆనుకొని ఉండటం వలన ఈ భూములు సారవంతంగా ఉంటాయి. దీనికి తోడు సాగుకు వేసవిలో నీటి నిల్వలు తగ్గువుగా తీసుకుంటాయి. అందువలనే ఈ ప్రాంతంలో వేసవిలో సాగు చేయడం కోసం రైతులు ఆసక్తి చూపుతుంటారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

జనవరి చివరి వారం నుండి ఇక్కడ పండిన పంట జిల్లా కేంద్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రధానంగా మార్చి, ఏప్రిల్ నెలలో అధికంగా దిగుబడులు రావడంతో తెలంగాణా, ఒడిశా, కోల్‌కతా వంటి రాష్ట్రాలకు ఇక్కడ పండిన టామాటాలు వ్యాన్లు, లారీలపై ఎగుమతి చేస్తారు. గత ఏడాది కొంతమంది రైతులకు ధరలు బాగుండటంతో ఎకరానికి రూ. 4 **లక్షల వరకు ఆదాయం పొందారు. ఎకరానికి రూ. 60 వేల వరకు ఖర్చు అవుతుంది. వేసవి కావడంతో రైతులు శ్రమ కూడా ఎక్కువగానే ఉంటుంది.**

దిగుబడి బాగు...

మొదటి దశలో వేసిన టమాటా కాపు దశలో ఉంది. వారం రోజుల నుంచి కాపు రావడంతో పంట సేకరించి నర్సీపట్నం, ఏఎల్‌పురం మార్కెట్లో అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 25 కేజీల టమాటా కేటు రూ.350లకు అమ్మకాలు జరుగుతున్నాయి. వీటి ధరలు వచ్చే నెలలో మరింత పెరిగే అవకాశం ఉంటుందని రైతులు నమ్మకం. కాపు అధికంగా ప్రారంభం కావడం నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడే కొనుగోలు చేసి వాటిని వ్యాన్లు, లారీలపై ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడం జరుగుతుంది.

> **ఈ సీజన్‌లో ఎంతో లాభం**
>
> 
>
> వేసవిలో టమాటా సాగు అంటే కత్తిమీద సాములాంటిది. వర్షాలు కురిస్తే పెట్టిన పెట్టుబడులు అంతా నష్టమే. వాతావరణం అనుకూలిస్తే లాభాలు వస్తాయి. ప్రస్తుతం రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా. రూ.80 వేల వరకు పెట్టుబడులు పెట్టాను. ఎంతో నమ్మకంతో సాగు చేస్తున్నా.
>
> – ఎస్.నూకరాజు, రైతు, గొలుగొండ

డీఎస్పీ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



నర్సీపట్నం : నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా పోతిరెడ్డి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా, బొబ్బిలి డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ బదిలీపై నర్సీపట్నం డీఎస్పీగా నియమితులయ్యారు. ప్రస్తుత డీఎస్పీ మోహన్ నుంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేసిన అనుభవం ఉందన్నారు. శాంతి భద్రతలు కాపాడడం, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా కట్టుదిట్టం చేస్తామన్నారు. గంజాయి వ్యాపారుల ఆస్తులను సీజ్ చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని సీఐలు ఎల్.రేవతమ్మ, గోవిందరావు, అప్పన్న, ఎస్ఐలు డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు సహకరిస్తే లోపాలు లేకుండా రీ సర్వే



రీసర్వే పై సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : భూములు రీ సర్వే చేసేటప్పుడు రైతులు సహకరిస్తే తప్పులు లేకుండా చేడవచ్చని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండలంలో భూములు రీసర్వే చేసేందుకు పెద బైరవ భూపతి అగ్రహారం రెవెన్యూ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో రీసర్వే చేస్తున్నారు రీసర్వేను గురువారం తహసీల్దార్ స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే 180 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారన్నారు. ఈ రెవెన్యూ గ్రామంలో 23 సర్వే నంబర్లలో 106 ఎకరాలు 93 సెంట్లు విస్తీర్ణం ఉందన్నారు. ఈ గ్రామంలో మొత్తం 95 మంది రైతులు భూములు కలిగి ఉన్నారని, వాటిలో 20 ఎకరాలు ప్రభుత్వ భూమి రికార్డుల ప్రకారం ఉందన్నారు. రీ సర్వే చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, ముర్రు ముత్యాలనాయుడు

కె.కోటపాడు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు సాగిస్తున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఎస్.కోటకు చెందిన సత్యసాయి దివ్యామృతం, స్పందన చేయూత సంస్థ సహకారంతో పది విద్యార్థులకు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గురువారం చౌడువాడ హైస్కూల్‌లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మండలంలో గల 7 హైస్కూళ్లతో పాటు కేజీబీవీ పాఠశాలలకు చెందిన 390 మంది విద్యార్థినులకు వీటిని అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుల్లో ఉత్తమ ఫలితాలను సాధించడం ద్వారా ఉన్నత ఉద్యోగ అవకాశాలను పొందడం సాధ్యమని గుర్తించాలని అన్నారు. అనకాపల్లి డీఈవో జి.అప్పారావు నాయుడు, ఎంఈవోలు సత్యనారాయణమూర్తి, డీవీడీ ప్రసాద్, హెచ్ఎం సన్నిబాబు పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మాకవరపాలెం : పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మాకవరపాలెం, రాచపల్లి పశువైద్యాధికారులు అనిల్, మణిదీప్ సూచించారు. మండలంలోని జి.వెంకటాపురం, మల్లవరం గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పశువులకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు

నర్సీపట్నం : ఏబీఎం విద్యాసంస్థల వారు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం కె.వి.రమణ విద్యార్థులకు సూచించారు. జిల్లా పరిషత్ హైస్కూల్(తురకబడి)లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏబీఎం విద్యాసంస్థల వారు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. సమయం కేవలం 45 రోజులు మాత్రమే ఉన్నందున విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐ.శ్రీనివాసరావు, సునీత పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలి

పదో తరగతి పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రుల సమావేశంలో హెచ్ఎం వెంకటరమణ పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్నంత సేపు విద్యార్థులు చదువుపై మనస్సు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత వారిని చదివించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు.



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ట్రస్టు సభ్యులు

చీడికాడ : పదో విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువు కొనసాగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని అమ్మా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటరావు అన్నారు. గురువారం మండలంలోని అప్పలరాజుపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 58 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటిరియల్ అందించారు. హెచ్ఎం కళ్యాణి మాట్లాడుతూ దాతలు అందించిన స్టడీ మెటీరియల్ వినియోగించుకోవాలన్నారు. ట్రస్టు సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మంచు ముసుగులో గ్రామాలు



భోగాపురంలో దట్టంగా కమ్మిన మంచు

రోలుగుంట : మండలంలో గురువారం పలు గ్రామాల్లో దట్టంగా మంచు కురవడంతో వాహనా చోదకులు, ఉద్యోగులు, రైతులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలు దాటే వరకూ రహదారులు కనిపించని విధంగా మంచుకురిసింది. సూర్యుడు కూడా ఉదయించినా వెలుగురాని పరిస్థితి. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకొని బి.ఎన్.రోడ్డు గ్రామాల్లోను లైట్లు వేసుకొని వాటి కాంతిలో ప్రయాణాలు చేశారు. రైతుల తమ పాకల నుంచి ఇంటికి వచ్చే సమయంలో మంచుకు రహదారి కనిపించకపోవడంతో ఎదురెదురు వచ్చేవారు ఒకరికొకరు ఢీ కొట్టుకుని ఇక్కట్లు పడ్డారు. ఈ ఏడాది ఈ సీజన్‌లోనే గురువారం దట్టంగా మంచు కురిసింది. ప్రజలకు తొమ్మిది గంటలు దాటిన తరువాత మంచు ముసుగులో వస్తూ సూర్యుడు కనిపించాడు.

పెదగోగాడలో లేగ దూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

చీడికాడ : మండలంలోని పెదగోగాడలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదగోగాడ,అడవి అగ్రహారం, జి.కొత్తపల్లి, తురువోలు, అర్జునగిరి గ్రామాల నుంచి పాడిరైతులు తమ వద్ద గల మేలు జాతి ఏడాది లోపు గల జెర్సీ,హెచ్.ఎఫ్, ముర్రా గేదె జాతి లేగదూడలను ఈ ప్రదర్శనకు తీసుకొచ్చారు.మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డా.చిట్టినాయుడు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళులు



ఏ.ఎల్ పురం కళాశాలలో నేతాజీ జయంతి



సుభాష్ చంద్రబోస్ వేషధారణలో విద్యార్థి



కె.కోటపాడులో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నూర్జహాన్, విద్యార్థులు

గొలుగొండ : సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో యువత నడవాలని హిమగిరి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి ఎం. సత్తిబాబు తెలిపారు. ఏఎల్‌పురం జూనియర్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తి చంద్రబోస్ అని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో చంద్రబోస్ దేశానికి అందించిన సేవలను హెచ్ఎం కోసూరు రాము విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో చదువుతున్న నాలుగో తరగతి విద్యార్థి నకిరెడ్డి రిత్విక్ సుభాష్ చంద్రబోస్ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

నర్సీపట్నం : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పెదబొడ్డేపల్లి ట్యాంక్ బండ్ చెరువు ప్రాంతంలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ స్వాతంత్ర్య సమరాన్ని అంతర్జాతీయ వేదికకు చేర్చి, బ్రిటిష్ వాళ్లకు కంటి మీద కునుకు లేకుండా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమరాన శ్రీను, బేతిరెడ్డి విజయ్, చీటీల రాము పాల్గొన్నారు.



చోడవరం డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి

కె.కోటపాడు : స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని కె.కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిం, ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ నూర్జహాన్ అన్నారు. పాఠశాలలో గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి వీరు పూలమాలను వేసి విద్యార్థులతో కలిసి నివాళులు అర్పించారు. ఖాసిమ్ మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించిన నేతాజీ జాతీయవాదిగా వినుతికెక్కారని తెలిపారు. ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.



కేజేపురంలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులు

నేతాజీ సైన్యమే ఆజాద్ హింద్ ఫౌజ్

చోడవరం రూరల్ : స్వాతంత్ర్య సాధన కోసం నేతాజీ ఏర్పాటు చేసిన సైన్యమే ఆజాద్ హింద్ ఫౌజ్ అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో నేతాజీ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, పిచ్చమ్మ, రత్నభారతి నేతాజీ సేవలను కొనియాడారు.

మాడుగుల రూరల్: కె.జె.పురంలో నేతాజీ సుభాష్ చంద్రబోష్ జయంతి వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు, గ్రామంలో నేతాజీ విగ్రహానికి సోషల్ వర్కర్ రాపేటి సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఆల్ల శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

సత్యవరంలో ఆధార్ నమోదు

మాడుగుల : మండలంలో సత్యవరం సచివాలయంలో గురువారం ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 25 మంది చిన్నారులుకు కొత్తగా ఆధార్ నమోదు చేశారు. అదే విధంగా ఆధార్‌లో తప్పులు దొర్లిన వారికి సరిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, మహిళా పోలీసు నూకరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి తీర్థం



చంద్రయ్యపేటలో మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : చంద్రయ్యపేట గ్రామస్తులు మల్లికార్జునస్వామి తీర్థ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలను జరిపారు. పెద్ద సంఖ్యలో బంధువుల, స్నేహితుల రాకతో గ్రామంలో సందడిగా మారింది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సబ్బవరపు అప్పలనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పార్వతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : కె.కోటపాడులో సబ్ స్టేషన్‌లో మెయిన్‌టెనెన్స్ పనులు నిర్వహించనున్న దృష్ట్యా సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో గల కె.కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, గుల్లేపల్లి, ఎ.కోడూరు, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, దాలివలస, గొట్లాం, కె.సంతపాలెం, ఆర్లి, ఎ.భీమవరం, పైడంపేట తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ చంద్రశేఖర్ కోరారు.

ఏరియా ఆస్పత్రిలో పింఛనుదారుల గుర్తింపు శిబిరం

నర్సీపట్నం : ఏరియా ఆస్పత్రిలో పింఛన్‌దారుల గుర్తింపు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. వాస్తవ గుర్తింపునకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్‌దారుల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేశామని జిల్లా అదనపు వైద్యాధికారి జ్యోతి తెలిపారు. కంటి చూపుతో ఇబ్బంది పడుతూ పింఛన్లు పొందుతున్న వారిని ప్రత్యేక వైద్య బృందం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు 50 మంది వరకు తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 4112 మంది కంటి చూపు సరిగా లేని వారు పింఛన్లు పొందుతున్నారన్నారు.

పశు వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోండి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సూర్యచంద్ర

నాతవరం : పశు వైద్య శిబిరాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్ర అన్నారు. గురువారం లక్ష్మీపురం రాజుపేట అగ్రహారం గ్రామాల్లో పాయకరావుపేట పశువైద్యశాఖ ఏడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పశువులను ఉచితంగా పరిక్షించి మందులు అందజేశారు. సర్పంచ్ గుడపర్తి అచ్చియ్యనాయుడు, చెర్లోపాలెం మాజీ సర్పంచ్ బాబులు పంచాయతీ కార్యదర్శ లోవరాజు పాల్గొన్నారు.